క్లుప్తంగా

జాబ్ మేళాలో 13 మంది ఎంపిక



జాబ్ మేళాలో మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు

సింగరాయకొండ: స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో 13 మంది ఎంపికైనట్లు యంగ్ ప్రొఫెషనల్ అధికారి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రమేష్ మాట్లాడుతూ ప్రతినెలాఖరున ప్రతి మండలంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, ఈ జాబ్‌మేళాలో 26 మంది నిరుద్యోగులు పాల్గొనగా మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ షేక్ బాషా, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ



పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

సింగరాయకొండ: స్థానిక పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పరిశీలించారు. సీఐ హజరత్తయ్య ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దడానికి చేస్తున్న పనులను ఆయన అడిగి తెలుసుకున్నారు. తరువాత స్టేషన్ ఆవరణలో చోరీకి గురైన కార్లను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను ఏఆర్ విభాగానికి సంబంధించిన అధికారులు వచ్చి పరిశీలించారు. ఎస్సై బీ మహేంద్ర, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న పీసీ కేశవరావు

కనిగిరిరూరల్: అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులతో సమ్మెకాలంలో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు అమలు, మినీ అంగన్ వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రజిని, సీత, కుమారి, కొండమ్మ, దావీదు, చెన్నారావు, చిన్న, నరసయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పచ్చాకు ట్రాక్టర్ డ్రైవర్లకు కౌన్సెలింగ్



డ్రైవర్, కూలీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ కోటయ్య

పీసీపల్లి: మంచు పడుతున్న సమయంలో పొగాకు ట్రాక్టర్లు జాగ్రత్తగా నడపాలని పీసీపల్లి ఎస్‌ఐ జీ కోటయ్య అన్నారు శుక్రవారం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పెద్ద అలవలపాడు గ్రామం వద్ద పొగాకు ట్రాక్టర్లను తనిఖీ నిర్వహించారు. పొగాకు లోడ్‌లతో వెళ్తున్న ట్రాక్టర్లపై ప్రయాణిస్తున్న కూలీలను దించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాక్టర్ డ్రైవర్ల అందరూ పొగాకు లోడ్‌లతో వెళ్లేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ కూలీలను ట్రాక్టర్‌పై ఎక్కించరాదని, సైడ్ డోర్లు ఓపెన్ చేయరాదని హెచ్చరించారు.

బ్రాండ్ అనుకుంటివా !

- ఇవి ఉలవపాడు మామిడి కాయలు కాదండోయ్.. !
- హైవేపై బయట ఉలవపాడు కాయల పేరుతో అమ్మకం
- అనంతపురం నుంచి తెచ్చి విక్రయిస్తున్న వైనం

ఉలవపాడు: ఫలాల్లో రారాజు మామిడి. మామిడి పండ్లు అంటే ప్రతి ఒక్కరికి ఇష్టమే. ఉలవపాడు ప్రాంతంలో పండించే మామిడి కాయలకు ప్రత్యేకమైన రుచి ఉంటుంది. అంతేకాదు ప్రపంచ వ్యాప్తంగా పేరు కూడా ఉంది. అందువే వేసవి కాలంలో వచ్చే ఉలవపాడు మామిడి కాయలకు మంచి గిరాకీ ఉంటుంది. జాతీయ రహదారిపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని కాయలను విక్రయిస్తారు. ఈ ఉలవపాడు బ్రాండ్‌ను ఉపయోగించుకుని సొమ్ము చేసుకోవాలని కొందరు వ్యాపారులు ఆలోచించారు. ముందుగా జనవరిలోనే వచ్చే అనంతపురం ప్రాంతం మామిడికాయలను ఇక్కడకు తీసుకుని వచ్చి ఉలవపాడు ప్రాంతం జాతీయ రహదారిపై పెట్టి అమ్మితే మంచి లాభాలు ఉంటాయని వ్యాపారం ప్రారంభించారు. ఈ సమయంలో కాయలు ఉండవు కాబట్టి కొనుగోలుదారులు ఇష్టంతో అధిక రేట్లకు కొనుగోలు చేస్తారు. ఇలా హైవేపై వ్యాపారులు మామిడి కాయల అమ్మకాలు ప్రారంభించారు. సాధారణంగా ఉలవపాడు ప్రాంతంలో వేసవి సమయంలో కాయలు కేజీ రూ.100 అమ్ముతుంటారు. కానీ ఇప్పుడు ఈ అనంతపురం కాయలను కేజీ రూ.250 లెక్కన అమ్ముతున్నారు. కారు, లారీలు, బస్సులలో వచ్చేవారు ఉలవపాడు ప్రాంతంలో ఉన్న మామిడి తోటల ముందే పెట్టి అమ్ముతుండడంతో అవి ఇక్కడి కాయలే అని కొని మోసపోతున్నారు. ప్రస్తుతం అమ్ముతున్న కాయలు పుల్లగా ఉంటున్నాయని కొనుగోలు దారులు చెప్పన్నారు. దీని వల్ల ఉలవపాడు కాయలకు ఉన్న బ్రాండ్ దెబ్బతింటుందని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు.

ఉలవపాడు ప్రాంతంలో పూతదశలో..

ప్రస్తుతం ఉలవపాడు ప్రాంతంలో ఇంకా మామిడి చెట్లు పూత దశలోనే ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించని కారణంగా ఈ ఏడాది మామిడి తోటల్లో పూతలు ఆలస్యంగా వచ్చాయి. జనవరి ఆఖరులో పూతలు వచ్చిన తరుణంలో ఇక్కడ కాయలు పెట్టి అమ్ముతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఉలవపాడు బంగినపల్లికి ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ అమ్ముతున్న బంగినపల్లె కాయలకు రుచిలో చాలా తేడా ఉంది. కాబట్టి వాహనదారులు ఇవి ఉలవపాడు మామిడి కాయలు అని మోసపోవద్దని, బయట అనంతపురం నుంచి వచ్చిన కాయలని గుర్తించాలని వ్యాపారులు కోరుతున్నారు.



ఉలవపాడు పేరుతో జాతీయ రహదారిపై అమ్ముతున్న కాయలు



ప్రస్తుతం ఉలవపాడు ప్రాంతంలో పూతదశలో ఉన్న తోటలు



కిశోర్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ

జర్నలిస్ట్ కిశోర్ మృతి తీరని లోటు



కనిగిరిరూరల్: వెలిగండ్ల మండల సాక్షి సీనియర్ రిపోర్టర్ బీ కిశోర్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీనియర్ రిపోర్టర్ కిశోర్ భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి కిశోర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాని ప్రార్థించారు. సీనియర్ పాత్రికేయుడిగా కిశోర్ అనేక సేవలు అందించారని కొనియడారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గజ్జల తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు నాగూర్ యాదవ్, తాతపుడి సురేష్, కటికల వెంకట రత్నం, ఎలికా నారాయణ, తాతపుడి నాని, కే రమణయ్య, పల్నాటి భాస్కర్‌రెడ్డి, జీ అనీల్, బి వెంకట రెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, జీ ఆదినారాయణ, జైపాల్, జీ రవీంద్రా రెడ్డి, జీ లక్ష్మీ నారాయణ, బొబ్బా వెంటరెడ్డి, రమణయ్య, డి సోమయ్య తదితరులున్నారు. అలాగే కిషోర్ భౌతిక కాయాన్ని వివిధ పత్రికల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు, వివిధ పార్టీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించి, నివాళులర్పించారు. అశ్రునయనాల మధ్య కిశోర్ అంత్యక్రియలు జరిగాయి. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీ కృష్ణ, రామన వెంకటేశ్వరరెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, దేవసహాయం, పొల్లా సుబ్రహ్మణ్యం ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి నివాళులు



కోటేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న సురేష్



మస్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

సింగరాయకొండ: విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు బండి కోటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ విద్యానగర్‌లో శుక్రవారం అనారోగ్యంతో బండి కోటేశ్వరరావు తన నివాసంలో మృతి చెందారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మృతదేహానికి పూలమాల వేసి సురేష్ నివాళులర్పించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కోటేశ్వరరావు వైఎస్సార్ అభిమానిగా గుర్తింపు పొందాడని పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని కొనియాడారు. ఆయన వెంట సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, పార్టీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ హరిబాబు, చుక్కా కిరణ్‌కుమార్, మసనం వెంకట్రావు, యనమల మాధవి, రాపూరి ప్రభావతి, షేక్ కరీం, షేక్ కరిముల్లా, బల్లికూర శ్రీనివాసులు, దాసుశ్రీను, పసుపులేటి శ్రీనివాసులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దశదిన కర్మలో మాజీ మంత్రి సురేష్

కొండపి: మండలంలోని చిన్నకల్లగుంట గ్రామ సర్పంచ్ షేక్ వన్నూర్ తండ్రి షేక్ మస్తాన్ దశదిన కర్మ కార్యక్రమాన్ని తాటాకులకుపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని మస్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం సర్పంచ్ వన్నూరును, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, గ్రామ నాయకుడు ఓబుల్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, మండవ మాలకొండయ్య, కోటేశ్వరరెడ్డి, శివారెడ్డి, వై.వసంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు టీకాలతో వ్యాధులు దూరం



గంగపాలెంలో మందులు పంపిణీ చేస్తున్న ఎగ్జిక్యూటివ్ అధికారి చంద్రశేఖర్



పామూరు: పశువులకు మందులు వేస్తున్న డాక్టర్ శ్రీసాయి

పామూరు/సీఎస్‌పురం (పామూరు): పశువులు, జీవాలకు పశుపోషకులు ముందస్తు టీకాలు వేయించడం ద్వారా వాటిని వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఈమని శ్రీసాయి అన్నారు. మండలంలోని గోపాలపురం, సిద్ధవరంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీసాయి మాట్లాడుతూ సన్నజీవాల పోషకులు వాటికి ఎలాంటి అనారోగ్య సమస్యలకు గురికాకుండా, జీవాలను నష్టపోకుండా ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, వీఏహెచ్‌లు, పశుపోషకులు పాల్గొన్నారు.

✦ సీఎస్‌పురం మండలంలోని ముండ్లపాడులో పశువైద్యాధికారి డాక్టర్ మునీర్ పశువులకు టీకాలు, గొర్రెలు, మేకలకు నట్టలనివారణ మందు తాగించారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపూడి: రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగపాలెం గ్రామంలో శుక్రవారం పశువైద్యాధికారి ఐ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ఒంగోలు డీఎల్ డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొని మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ యర్రమోతుల శ్రీనివాసులు, పశువైద్య సిబ్బంది గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్యపదార్థాలు లేని పొగాకుకు మంచి ధర



రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్




జరుగుమల్లి: పొగాకు నాణ్యత పరిశీలిస్తున్న క్షేత్ర సిబ్బంది

కొండపి: అన్యపదార్థాలు లేని మంచి పొగాకు మంచి ధర లభిస్తుందని కొండపి వేలం నిర్వహణ అధికారి జీ. సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని గోగినేనివారిపాలెంలో శుక్రవారం పొగాకు క్యూరింగ్, గ్రేడింగ్‌లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ మాట్లాడుతూ, పొగాకులో అన్యపదార్థాలు గుట్కా, ఖైని, సిగరెట్లు, బీడీలు, చాక్లెట్లు ఇతర ప్లాస్టిక్ పదార్థాలు రాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రేడింగ్ సమయంలో వాటిని తీసివేయాలని సూచించారు. పొగాకుతో పాటు ప్రత్యామ్నాయ పంటలైన కంది, మిరప, శనగ పండించడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఆఫీస్ ఏఎస్ తులసి, ఐటీసీ కంపెనీ మేనేజర్ వెంకటరావు, జీపీఐ శ్యామల, పీఎస్ హెచ్ కంపెనీ వివేక్ పాల్గొన్నారు.

కాల్చులో మెళుకువలు పాటించాలి..

జరుగుమల్లి (సింగరాయకొండ): పచ్చాకు కోతల్లో, కాల్చులో మెళుకువలు పాటించి అధిక లాభాలు పొందాలని టంగుటూరు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు అన్నారు. జరుగుమల్లి మండలంలో పొగాకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ కార్యాలయం అధికారులతో కలిసి పొగాకులో తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన చర్యలు రైతులకు అవగాహన కల్పించారు. జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడు, జరుగుమల్లి, చింతలపాలెం, దావగూడూరు, చిర్రికూరపాడు, కమ్మవారిపాలెం గ్రామాల్లో బోర్డు అధికారులు పర్యటించారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి జె తులసి, క్షేత్రాధికారి జె ఉపేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం



అలంకరణలో వాసవీమాత



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

పామూరు: ఆర్య వైశ్య కులదేవత వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాసవీమాత ఆలయ ప్రాంగణంలో ఉదయం గణపతి హోమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో రుత్వికులు రాయప్రోలు తులసీనాథ్, రాఘవ సుమంత్‌లు వాసవీమాత మూల విగ్రహమూర్తికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక సత్యనారాయణస్వామి దేవస్థానం వద్ద నుంచి ఆర్యవైశ్య మహిళలు మేళతాళాల నడుమ జ్యోతులతో ప్రదర్శనగా వాసవీమాత ఆలయానికి వచ్చారు. అనంతరం ఆలయంలో కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా రాత్రికి గుండం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ ఏల్చూరి బాలకొండలరావు, విశ్వనాథుని మణికంఠ సత్యనారాయణ, దర్శి మస్తాన్‌రావు, సత్యనారాయణ, శేగు క్రిష్ణయ్య, నరసింహారావు, కొత్తూరి హరగోపాల్, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడు చిన్ని సేవలు మరువలేనివి



చిన్ని దంపతులను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

సీఎస్‌పురం (పామూరు): వృత్తిలో అంకితభావంతో పనిచేసిన వ్యక్తి మన్నేపల్లి చిన్ని అని మండల ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ గద్దే ఏడుకొండలు, డాక్టర్ పుండరీకాక్షయ్యలు అన్నారు. మండలంలోని డీజీపేట ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో సిబ్బందిగా 37 సంవత్సరాలుగా పనిచేస్తు శుక్రవారం ఉద్యోగ విరమణ చేసి చిన్ని దంపతులను అరివేముల ఆయుర్వేద వైద్యశాలలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ చేసిన చిన్ని డీజీపేట, అరివేముల వైద్యశాల పరిధిలోని ప్రజలకు సేవలు అందించారన్నారు. డాక్టర్ శరత్, ఆళ్ల భాస్కర్‌రావు, ఎస్.వెంకట్రామయ్య, పాశ్చామియా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాల తనిఖీ



గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణంలోని మాచవరం సమీపంలో గల వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ తరగతి గదులను, డైనింగ్ హాల్, మెనూ పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన తీరు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలన్నారు. బాలికల విద్యతోనే సాధికారత సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమయపాలన పాటించని ఇరిగేషన్ అధికారులు



మూతపడిన ఉన్న ఇరిగేషన్ కార్యాలయం

సింగరాయకొండ: ఇరిగేషన్ అధికారులు సమయపాలన పాటించకపోవటంతో కార్యాలయం నిరంతరం మూతపడి ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాలేరు- బిట్రగుంట స్కీమ్ సప్లయ్ చానల్ అభివృద్ధికి సుమారు రూ.1.25 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో ఛానల్ అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిధులను ఏయే అభివృద్ధి పనులకు కేటాయించారో తెలియటం లేదని వాస్తవానికి చానల్ పరిధిలోని చెరువుల గేట్లు పాడయ్యాయి. దీంతో నీరు వృథాగా పోతుందని కావున కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని, చెరువు కట్టలు బాగుచేయాల్సి ఉందన్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడదామంటే గత 15 రోజులుగా ఎప్పుడు కార్యాలయానికి వెళ్లినా మూసి ఉంటుందని సిబ్బంది ఎప్పుడు వస్తారో అర్థం కావడం లేదన్నారు. దీనికి తోడు ఏ స్థాయి అధికారి కూడా మండలంలోని రైతులకు ఎవరికీ తెలియదని ఆయన కూడా ఎప్పుడు వస్తాడో అర్థం కావటం లేదన్నారు. దీంతో ఇటీవల కాలంలో చెరువుల్లో అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయని రైతులు చెప్పారు. అధికారులకు చెప్పినప్పటికీ వారు వెళ్లి మామూళ్లు తీసుకుని పట్టిపట్టనట్లుగా వ్యవహరించారని ఆరోపించారు. ఇరిగేషన్ అధికారుల లంచగొండితనం కారణంగా చెరువుల్లో భారీగా గుంతలు ఏర్పడ్డాయన్నారు. కావున ఇప్పటికైనా అధికారులు అందుబాటులో ఉండి రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

గ్రేడింగ్‌లో జాగ్రత్తలు అవసరం

టంగుటూరు: రైతులు పొగాకు క్యూరింగ్, గ్రేడింగ్‌లో జాగ్రత్తలు పాటించాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక వేలం కేంద్రం పరిధిలోని జరుగుమల్లి, వావిలేటిపాడు, చింతలపాలెం, చిర్రికూరపాడు, కమ్మవారిపాలెం మొదలకు గ్రామాలు పర్యటించి పొగాకు రైతుల సమస్యలు తెలుసుక్నన్నారు. ఈ సందర్భముగా వేలం నిర్వహనాధికారి శ్రీనివాసరావు పొగాకు పంట ఉత్పత్తి తర్వాత నిర్వహణ, పురుగు మందులు వాడుట వలన తలెత్తే ఆరోగ్య సమస్యలు, నివారణ గురించి సలహాలు, సూచనలు అందించారు.



మారెళ్ల సమీపంలో పిల్లి వాగు వద్ద కొట్టుకుపోయిన రోడ్డు



నీరదపల్లి అడ్డరోడ్డు కొత్త కుంట వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

నరక దారులు

మండల పరిధిలోని ఆర్ అండ్ బీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. సుమారు 40 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు ప్రతి 20 మీటర్లకు 10 గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.

- పీసీపల్లి